

# రుధిరోదనం

కాలెపు శివశేఖర్

పొయ్యిలో పిల్లి ఇంకా లేవలేదు. అంటే ఆ యింట్లో ఆ రోజుకూడా పస్తులు కుస్తీలు పడ్తున్నాయన్న మాట!

తాయారు కడుపులో ఆకలికన్నా, గుండెల్లో వేదన అధికంగానే ఉంది. ఆమె నరనరాల్లో నైరాశ్యం నిక్షిప్తంగా కమ్ముకొని వుంది. కళ్ళల్లో కన్నీళ్ళు కెరటాల్లా పొంగుతూనే వున్నాయి. అలవాటు పడ్డ ప్రాణం ఆకల్ని మర్చిపోయిందేమోగానీ, శరీరం మాత్రం నిస్త్రాణాన్ని మర్చిపోలేదు.

పొయ్యిమీద పొంగు వార్చి నాలుగు రోజులవుతోంది.

తాయారు మాత్రం మొగుడి ఎదుట 'ఆకలి' అని అనదు. ఆమె మొగుడు రాజన్న మాత్రం ఏ అర్ధరాత్రి వేళో

మస్తుగా తాగొచ్చి పెళ్ళాం మీద పడి తన 'ఆకల్ని' మాత్రం తీర్చుకుంటాడు.

ఏ బారెడు పొద్దెక్కాకో తాపీగా నిద్రలోంచి లేచే రాజన్న, బయటికి పోయేముందు పొయ్యిలో ఉన్న పిల్లిని ఒక్క తాపు తన్ని మరీ వీధిలోకి వెళ్తాడు.

తనను అలా తన్నిన రాజన్న వేపు పిల్లి కోపంతో చూసిందేమోగానీ, తాయారు మాత్రం ఎన్నడూ మొగుడివేపు కోపంతో చూడలేదు. మొగుడు ఎంత వెధవైనా, వాడే దైవం అనుకొని, వాడు తన్నినా, తిట్టినా- వాణ్నే పూజించే పతివ్రతా శిరోమణులు ఇంకా ఈ దేశంలో ఉన్నప్పుడు తాయారులాంటి ఆడది- అణిగి, మణిగి ఉండటంలో ఆశ్చర్యం లేదు.

ఆమె పుట్టగానే పాలు లేక ఆకలి మంటల్తో ఏడ్చింది. పెద్దయ్యాక అన్నం లేక అల్లాడిపోయింది. పెళ్ళయ్యాక అదే వేదనతో ఏడ్చి ఏడ్చి కన్నీళ్ళు యింకిపోయాయి. ఆఖరికి ఆకలి మంటలకు అలవాటు పడిపోయింది. అలాగే మొగుడిచేతి దెబ్బలకు కూడా అలవాటు పడిపోయింది.

పెళ్ళయిన కొత్తలో అందరి మగాళ్ళలా రాజన్నకూడా పెళ్ళాన్ని బాగానే ప్రేమించాడు. ఆ ప్రేమ మరి కాస్త ఎక్కువైన రాజన్న తన ప్రేమను పరాయికాంతలకు కూడా పంచి పెట్టాడు. ఆ తర్వాత మత్తుపానీయాలు తాగకపోతే బాగోదనుకొని క్రమంగా తాగుడ్ని అలవాటు చేసుకొని, సక్రమంగా సారా కొట్లు మరిగాడు.

అటుపై తనకు పెళ్ళయిందనీ, తనకో పెళ్ళాం వుందనీ గుర్తున్నా, మరెందుచేతనో మర్చిపోయాడు. అసలు పెళ్ళాన్ని పూర్తిగా మర్చిపోయేవాడే! కానీ తన జేబులో డబ్బులు లేనపుడు, పరాయికాంతలు చెంతకు చేరనీయనపుడు, తన సుఖానికి భంగం కలగకుండా వుండేందుకు- ఉచితంగా పెళ్ళాం దగ్గర సుఖం పొందవచ్చనే తెలివిగల వాడై పెళ్ళాన్ని మర్చిపోలేదు. అంతేగానీ రాజన్న పెళ్ళాన్ని పూర్తిగా వదిలేయలేదు.

ఆ వదిలేయకపోవడమే తాయారు దృష్టిలో రాజన్న యింకా దేవుడిగానే మిగిలిపోయాడు. అతగాడెంతటి చవటయినా తాయారుకు మాత్రం గొప్పవాడు. గొప్పవాడనుకునే రేయింబవళ్ళు శ్రమించి రిక్షా లాగి తన పొట్టను నింపేసుకొని, సారానీళ్ళను ఎక్కించేసి, పెళ్లాన్ని

తప్ప తన ఎరికలో ఉన్న ఆడాళ్లం దర్నీ తెగ సుఖపెట్టేస్తున్నాడు.

మరి! తాయారు చేసిన పాప మేమిటో?

రెండు రోజులయింది రాజన్న ఇంటికి వచ్చి. ఈ రెండు రోజుల నుంచీ తాయారు తిండి తినలేదు. అది మొగుడిమీద బెంగ కాదు- ఇంట్లో తినడానికంటూ తిండి లేక! పిల్లి మాత్రం ఈ రెండురోజులూ వెచ్చగా పొయ్యిలో నిద్రపోతూనే ఉంది. దానికి ఆకలయినపుడు మాత్రం అలా కొంపలమీదకు పోయి, దొరికినకాడికి తినేసి, మళ్ళీ వచ్చి తన స్థానంలో పడుకుంటూనే ఉంది.

ఆ యింట్లో తాయారు వంట వండిన రోజు మాత్రం పిల్లికి తెగ కోపం వచ్చేస్తుంది. తన వెచ్చటి పరుపు మీద మంటల్ని పెట్టినట్లు ఫీలై పోతుందది. వంటై, పొయ్యి కాస్త చల్లబడేంతవరకు అది దూరంగా తచ్చాడుతూ వుంటుంది. అది ఎంత కోపగించినా, తాయారు పట్ల కృతజ్ఞతగానే వుంటుంది. ఎందుచేతనంటే- నెలకు పదిహేను రోజుల వరకు పొయ్యిమీద వంట చేయదు తాయారు.

వంట చేసినప్పుడు మాత్రమే పిల్లికి కాస్త ఇబ్బంది.

మూడోరోజు సాయంత్రం ఇంటికి వచ్చాడు రాజన్న.

మనిషి తాగి లేడు. తాగనప్పుడే యింటికి వస్తాడు రాజన్న. అంటే అతని దగ్గర డబ్బులు లేవని తాయారుకు తెల్సు.

రాగానే పెళ్ళాంమీదకు ఓ చిరునవ్వు విసిరేశాడు. ఆనక పక్క వేయమని చెప్పి, ఆపై తాయారు పక్కకు చేరాడు.

అంతేకానీ 'ఈ మూడురోజుల్నించీ నీవు తిండి తిన్నావా- లేదా?' అని మాత్రం అడగలేదు.

తాయారుకూడా చెప్పలేదు.

ఆకలితో కుష్కించి, నీర్సించి పోయిన శరీరాన్ని పక్కమీదకు చేర్చిన తాయారు, చాలా సేపటి వరకు కుక్కిన పేనులా అణిగి పోయింది.

అలిసిపోయిన రాజన్న కొద్దిసేపు తర్వాత తాయారువేపు చూశాడు.

ఆమె శవంలా అలానే పడుకోనుంది.

ఆమె చూపులు పైకప్పును చూస్తున్నాయ్. శ్వాస పీలుస్తున్న శబ్దమే లేదు. మొహంలో ప్రేతకళమాత్రం స్పష్టంగా అగుపడ్తోంది. శరీరం ఎముకల గూడులా, గుండెలపై కండరాలు తోలు తిత్తుల్లా వేలాడుతూ, కడుపు వెన్నుకి అతుక్క

పోయి, యింకా క్రిందభాగం....
యిక చూడలేకపోయడు రాజన్న.
'ఈ అస్థిపంజరాన్ని యింతసేపు తను....' ఆ తర్వాత అనుకోడానికి భయపడిపోయాడు.
ఆమె శరీరం యానత్తూ అసహ్యంగా అగుపడసాగింది.
"ఏయ్! లే....లేచి బట్టలు కట్టుకో!" హఠాత్తుగా అరిచాడు రాజన్న.
అతని అరుపుకి యింటి పైకప్పు అదిరి రెండుతాటాకులు జారిపడ్డా యేమోగానీ, తాయారులో ఏ మాత్రం చలనం కలగలేదు.
"లేవే లంజ!" కాలెత్తి ఆమె డొక్కలో తన్నాడు.
"అమ్మ్!" బాధగా ఆమె పెదవులు పలికేలోగా, ఆమె శరీరం నాలుగు గజాలు దొర్లింది. పక్కటెముకలు విరిగినంత బాధతో గిలగిల్లాడిపోయింది.
వెంటనే పైకి లేచిన రాజన్న తన బట్టల్ని కట్టేసుకున్నాడు.
అప్పటికింకా తాయారు పైకి లేవలేదు. ఉన్నచోటనే ముడుచుకొని విపరీతంగా మూల్గసాగింది.
ఆమెను ఆ స్థితిలో చూసిన రాజన్నకు మరింతగా వళ్ళు మండిపోయింది.
వొయ్యిలో పడుకున్న పిల్లి కళ్ళు ఎందుకో మరి ఎర్రబడి వున్నాయ్.
"లేయమని చెపుతుంది నీక్కాదటే...." విసురుగా ఆమె దగ్గరకు వెళ్ళి కాలెత్తాడు రాజన్న.
"ఆగు...." శక్తినంతా కూడదీసుకొని పిచ్చిగా అరిచింది తాయారు.
ఆమె శరీరాన్ని తన్నవలసిన రాజన్న కాలు మధ్యలో ఆగిపోయింది.
"మరోసారి నా వంటిమీద దెబ్బ పడిందా-నీ రక్తం కళ్ళ చూస్తాను." తాయారు గొంతు ఆ మాటల్ని కసిగా పలికింది.
అదిరిపడ్డాడు రాజన్న. ఆ వెనుకే ఆశ్చర్యపడ్డాడు. తర్వాత కింద పడబోయాడు. ఎలాగో నిలదొక్కుకొని, తల విదిల్చి, కళ్ళు చికిలించి ఆమె వేపు చూశాడు. అప్పటికే తాయారు కింద పడివున్న తన చీరను గబగబా చుట్టబెట్టుకుంటోంది.
"ఏవిటే లంజా........" అంటూ కోపంతో ఏదో అనబోయాడు.
అతని మాటలకు అడ్డొస్తూ, "అవును- నేను లంజనే. లంజను కనుకే నీవు నా దగ్గరకు వచ్చావ్. తీయ్ డబ్బులు....నా శరీరాన్ని యీ కొద్దిసేపు నీ స్వంతం చేసికొన్నందుకు నాకు డబ్బులు చెల్లించుకోరా...."అంది.
రాజన్నకు చూపు తప్ప మాట లేదు- మాట వున్నా అందులో శబ్దంలేదు 'ఇది తన పెళ్ళామేనా' అనే అను

మానం అర్జంటుగా వచ్చేసింది. ఏనాడు ఎదురు చెప్పని పెళ్ళాం యిలా హఠాత్‌గా ఎందుకు తిరగబడింది చెప్మా! ఆలోచిస్తూ నిలబడి పోయాడు.

"ఏం- అలా నిలబడిపోయావ్? డబ్బుల్లేవా? అయితే ఎందుకొచ్చావ్ యిక్కడికి? పెళ్ళాన్ని కదాని, నీ ప్రతీ చర్యకు కట్టుబడి ఉంటానని నీ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించావ్. ఒరేయ్ మొగుడు! కుక్కా.... నేను నీ పెళ్ళాన్ననీ.... నాకూ ఆకలి మంటలుంటాయని నీకు గుర్తుందట్రా.... యీ కడుపుకి తిండి తిని ఎన్ని రోజులయిందో నీకు తెలుసట్రా.... నే ఆకలికి మాడి, నీ కోసం ఎదురు చూస్తూంది యీ తుచ్ఛమైన సుఖంకోసం కాదురా! నీవురాల్చేపైసలుకోసం అంతకంటే కాదురా...నా ఆకల్ని తీర్చుకోడానికి కొన్ని నిమిషాలు పట్టదు.... అలా రోడ్డుమీద నిలబడి నలుగురు మగాళ్ళని ఆహ్వానిస్తే చాలు.... నా కడుపు నిండుతుంది. చేతి నిండా డబ్బు వుంటుంది. అటువంటి బతుకును కాదు నే నా శిం చే ది. నీవు ఇంటికి వస్తావని, ప్రేమతో నన్ను పలుకరిస్తావని.... ఆకలితో ప్రాణాలు అర్చుకు పోతున్నా గుమ్మం దగ్గరే చూస్తూ కూర్చున్నా. కానీ నీవొక పశువ్వి....పందివి.... ఛీ.... వాటికయినా హీనమైన జంతువ్వి.... నీలో దానవత్వం తప్ప మానవత్వం లేదు.... నీలో ప్రవహించేది నెత్తురు కాదు సారా నీళ్ళు.... పో.... వెళ్ళిపో...."

ఆవేశంతో అరిచేసిన తాయారు, కుప్ప కూలిపోయి వెక్కి వెక్కి ఏడ్చేయసాగింది.

పొయ్యిలో పిల్లి, ఎందుచేతనో ఉత్సాహంలో తలెత్తి తాయారు వైపు చూస్తుండిపోయింది.

ఏడ్చి ఏడ్చి అలానే సొమ్మసిల్లి పోయిన తాయారు ఎప్పటికో కళ్ళు తెరిచింది.

పాకలోగానీ-పాకబైటగానీ రాజన్న కన్పించలేదు.

ఆమె గుమ్మం దగ్గరే నిస్త్రాణగా కూర్చుండిపోయింది.

ఆమెలో బద్దలైన అగ్నిపర్వతం కన్నీటికడలిలోచల్లబడిపోసాగింది. ఆలోచన్లు కందిరీగలై మెదడును తూట్లు పొడవసాగాయ్.

తన జీవితం యింతే-బ్రతుకులో మార్పురాదు - మొగుడులో క్రూరత్వంపోదు.

ఆలోచన్లు కాలాన్ని కరిగించేయగా తాయారు మళ్ళీ నిస్త్రాణతో తల వాల్చేసింది.

ఆ తర్వాత మరోవారం వరకూ

యింటి ఛాయలకే రాలేదు రాజన్న. ఈ వారం రోజుల్లో తాయారు ఎన్ని పూటలు పస్తులు వుందో చెప్పాలంటే సాధ్యం కాకపోవచ్చుగానీ పిల్లిమాత్రం మూడు పూటలే పొయ్యి లోంచి లేవగలిగిందని చెప్పొచ్చు.

ఓ రోజు రాత్రి-వూరంతా నిద్రకు వుపక్రమించే వేళలో రాజన్న యింటికి వచ్చాడు.

పెళ్ళాన్ని చూసి యిదివరకట్లా యికిలించలేదుగాని - మెల్లిగా ఆమె చెంతకు చేరి అన్నాడు. "నన్ను క్షమించు తాయారు!"

తాయారు పలకలేదు.

"నా తప్పు తెల్సుకున్నాను. నీ అనుమతిలేనిదే-నీ శరీరాన్ని కూడా తాకను."

ఆశ్చర్యంగా అతని మొహంలోకి చూసింది తాయారు.

"నిజం! నన్ను నమ్మ. నిన్నెంత కష్టపెడుతున్నానో, నీ కడుపెంతగా మాడ్చుతున్నానో నాకు తెలీంది కాదు. కానీ, ఏం చేయను? వ్యసనాలకు బానిసనై పోయాను."

తాయారు గుండె మెల్లగా కరగ సాగింది.

కొద్దిసేపు ఆమె ముందు తల వంచుకొని వుండిపోయాడు.

తాయారు అతని మొహంకేసి చూస్తుండిపోయింది.

అయిదు నిమిషాలు అనంతరం-

"తాయారు! జీవితంలో నిన్ను ఏదీ యింతవరకూ అడగలేదు. కానీ యిప్పుడు నిన్ను అడక్క తప్పడం లేదు" అన్నాడు.

"ఏమిటది?"

"నా కింత అన్నం పెట్టగలవా తాయారు?"

తాయారు మనస్సు చివుక్కుమంది. అప్రయత్నంగా ఆమె కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగేయ్.

"ఆకలి మంటలు ఎలా వుంటాయో యీ మూడ్రోజుల నుంచీ రుచి చూస్తున్నాను. అద్దె చెల్లించక రిక్షా నా చేతుల్లోంచి జారిపోయింది. సంపాదనలేక, తిండి తినక నా నా శరీరం చచ్చుబడిపోయింది."

తాయారు ఏంమాట్లాడలేకపోతోంది. ఆకలితో యింటికి వచ్చిన భర్తకు తిండి పెట్టలేని తన దౌర్భాగ్యానికి లోలోనే కుమిలి పోసాగింది. గుండెల్ని మధించిన బాధ నరాల వెంట పాకి పెదవుల్ని కదపనీయ లేదు.

నిశ్శబ్దం యిద్దరిమధ్యా యినుములా ఘనీభవించింది.

రెండు నిమిషాలు తర్వాత-రాజన్న

అన్నాడు-"నాకు తెల్సు తాయారు, ఈ యింట్లో పిడికెడు మెతుకులు కూడా లేవని.ఏదో ఆశతో అడిగాను. ఆకలితో అలమటించి ఆశ పడ్డాను. అంతే!" ఆగి మళ్ళీ అన్నాడు- "తాయారు! ఈ ఇంట్లో ఆకలి మంటలు లేకుండాచేస్తాను. మన దరిద్రాన్ని తగులబెడతాను. నీతి, నియమం....సాంప్రదాయాలు కట్టుబాట్లు కూడు పెట్టవు మనకు. తాయారు! నీమీద నాకింకా నమ్మకం వుంది. నా మాటలకు విలువిస్తావని-నన్ను గౌరవిస్తావని విశ్వసిస్తున్నాను....ఈ రాత్రి నుంచే మన జీవితాలు స్వర్ణబాటలోకి అడుగు పెట్టాలి...." అతను ఆవేశంగా ఏదో చెప్పుకు పోతున్నాడు.

అర్థంకానట్లు అతని మొహంలోకి చూస్తూండిపోయింది తాయారు.

"సంపాదిస్తాను....నా శక్తి వంచన లేకుండా 'డబ్బు'ని వేటాడి తీసుకొస్తాను....నీ పెదవులపై చిరునవ్వు మాయనంతకాలం....నీలో రక్తమాంసాలు వున్నంత కాలం.. నా చర్యల్ని నీవు ప్రతిఘటించనంతకాలం....డబ్బును వేటాడుతూనే వుంటాను....వస్తా. ఇప్పుడే వస్తా...."అనేసి గబగబా బయటకు వెళ్ళిపోయాడు రాజన్న.

అయోమయంగా మొగుడు వెళ్ళిన వేపే చూస్తూండిపోయిందితాయారు. పొయ్యిలో పిల్లి మాత్రం బద్ధకంగా ఆవులించింది.

గంట గడిచింది.

దూరంగా రాజన్న యింటి వేపు వస్తూ కన్పించాడు.

అతని పక్కగా మరోవ్యక్తి నడిచి వస్తున్నాడు. చీకట్లో ఆ వ్యక్తి మొహం కనిపించడంలేదు.

తాయారు తలుపు చాటున నిలబడిపోయింది. కొన్ని నిమిషాలు తరువాత లోనికి వచ్చాడు రాజన్న. అతన్తోపాటు వచ్చినవ్యక్తి బయటే నిలబడిపోయాడు.

"నా జీవితంలో నిన్ను కోరుతున్న రెండో కోరిక యిది....అయిదు నిమిషాలు నీ శరీరం నీది కాదనుకో తాయారు!" రాజన్న ఆమె ముందు నిలబడి అన్నాడు.

పెదవులు కదపలేదు తాయారు.

"నా కోర్కెను కాదనవుకదూ?"

"నీ మాటలునా కర్థంకావడంలేదు."

"అర్థాలు చెప్పే సహనం నాకులేదు. చెప్పింది చెయ్" అనేసి-బయటకు తొంగి చూసి,

"రండి బాబు" అన్నాడు.

బయటున్న వ్యక్తి లోనికొచ్చాడు.

ఆ వ్యక్తి ఖరీదైన బట్టల్లో మెరిసి పోతున్నాడు. అతని జేబు నిండా డబ్బుంది. కళ్ళ నిండా ఆకలుంది. తాయారది చూడగానే ఆకలి కళ్ళు అప్సరావురన్నాయ్- జేబులో కరెన్సీ కరకరలాడింది.

"కానీండి బాబూ!" అనేసి రాజన్న బయటకు వెళ్ళబోయాడు.

ఆ వ్యక్తి ఆమె వద్దకు కదల బోయాడు.

"ఆగు!" భూనభోంతరాళాలు అదిరేలా అరిచిందామె.

ఇద్దరూ ఒక్కసారిగా నిలబడి పోయారు.

"ఏమిట్రా నీవు చేస్తున్న పని? పరాయి మగాడికి నన్ను అప్పజెప్ప డానికి సిగ్గులేదు. ఆఖరికి స్వంత పెళ్ళాన్ని తార్చేస్థితికి దిగజారి పోయావ్. ఛీ! నీకంటే కుక్క నయం. పెళ్ళాన్ని పోషించడం చేతకాని నీలాంటి అల్పులు యింత కంటే యింకేం చేయగలరు?వెళ్ళు. తక్షణం యిక్కణ్నుంచి పో.... థూ!" అతని చొక్కా పట్టుకొని ఆవేశంతో వూగిపోతూ, బలంగా బయటకు నెట్టింది తాయారు.

రాజన్నలో అహం తలెత్తింది. కోపం కరినాగై బుసలు కొట్టింది. కళ్ళు చింతనిప్పులై పొగలు కక్కాయ్!

ఆ వ్యక్తి మాత్రం బిత్తరపోయి నిలబడిపోయాడు.

ఆమె జుట్టు పట్టుకొని వంగదీసి కసి దీరా పిడికిళ్ళతో మోదసాగాడు రాజన్న.

ఎక్కడో వీధి కుక్కలు వికృతంగా అరుస్తున్నాయ్. దూరంగా శ్మశానంలో నక్కలు వూళలు వేస్తున్నాయ్.

ఆమెబాధతోఅరిచిందో,ఏడ్చిందోలేక అరుస్తూ ఏడ్చిందోగానీ తాయారు కళ్ళలోంచి రుధిరధారలే జారి పడ్తున్నాయ్.

'ఆడది యింత అందంగా ఎలా ఏడ్వగలదబ్బా!' అనుకుంటూ ఆ వ్యక్తి ఆ దృశ్యాన్ని చూస్తూ ఆలోచించసాగాడు.

చేతులకు తాత్కాలిక విశ్రాంతి నిచ్చి కాళ్ళకు శ్రమ కలిగించాడు రాజన్న. కిందపడిన తాయారు శరీరాన్ని రాజన్న పాదాలు కుమ్మివేయ సాగాయ్.

ఆమెలో ఎముకలు విరగని భాగాలేమైనా వున్నాయేమోగానీ దెబ్బలుతగ లని భాగాలు శరీరంపై లేవు.

'ఆడది యింత అందంగా దెబ్బల్ని ఎలా భరించగలదబ్బా!' అనుకుంటూ ఆ వ్యక్తి ఆ దృశ్యాన్ని చూస్తూ ఆలోచిస్తూనే వున్నాడు.

ఇంకా కసితీరని రాజన్న ఆమె శరీరంపై బట్టల్ని బరబరా లాగేస్తూ పరపరా చింపివేయసాగాడు.

అతన్ని ఎదిరించే శక్తి ఆమెలో ఎప్పుడో సన్నగిల్లి పోయింది. ఆమె గోడుగోడున ఏడుస్తూ తన శరీరాన్ని చేతులతో కప్పుకోడానికి ప్రయత్నిస్తోంది.

ఆబగా ఆ వ్యక్తి కళ్ళు చూస్తూనే వున్నాయ్.

కొన్ని నిమిషాల్లోనే తాయారు శరీరంపై బట్టలన్నీ వేరయిపోయాయి.

సిగ్గుతో- బాధతో- అవమానంతో తన నగ్నత్వాన్ని దాచుకోలేక ముడుచుకుపోయింది తాయారు.

"త్వరగా రండి బాబూ!" రాజన్న అంటున్నాడు.

ఆ వ్యక్తి కళ్ళనిండా నగ్నత్వం నిండిపోయింది. తడబడుతున్న అడుగుల్తో ఆ వ్యక్తి తాయారు వద్దకు నడుస్తున్నాడు.

తాయారు కాళ్ళదగ్గర కూర్చున్న రాజన్న ఆమె శరీరాన్ని ఆ వ్యక్తికి అనువుగా తిప్పడానికి ప్రయత్నిస్తున్నాడు.

తాయారు గుండెలు పగిలిపోయాయ్.

తాయారు హృదయం బద్దలైంది. తాయారు మనసు ముక్కలైంది. ఆమె కళ్ళు మూగగా కన్నీళ్ళు కార్చుతున్నాయ్.

ఈ గుండె ఆగిపోతే- ఈ శరీరం చల్లబడిపోతే- ఈ కట్టె కాలిపోతే- ఘోషిస్తోంది తాయారు లోలోన. అయినా పెనుగులాడుతూనే ఉంది.

ఆ వ్యక్తి పులిలా ఆమె మీద పడ్డాడు.

ఆ యిద్దరూ ఆమె శరీరంతో పోరాడుతున్నారు.

"లేరా.... ఎవరూ లేరా.... తనను రక్షించేవారెవరూ లేరా.... భర్తే తనని కబళిస్తుంటే- భర్తే తనని తార్చుతుంటే- యింకెక్కడుంది పవిత్రత.... యింకెక్కడుంది రక్షణ.... వీడి ఆకలి కళ్ళు నా శరీరాన్ని కసిగా చూస్తున్నాయ్....

అంగాంగాల్ని కామవాంఛతో వాడి కళ్ళు కాలేస్తున్నాయ్.... నన్ను మలినం చేయడానికి నా భర్త ప్రయత్నిస్తున్నాడు.... ఒరేయ్ దేవుడూ ఎక్కడున్నావురోయ్.... ఒరేయ్ రాముడూ.... వెధవ రాముడో- ఎక్కడ చచ్చావురా.... ఒరేయ్ కృష్ణుడూ.... దొంగ కృష్ణుడో ఎక్కడ కులుకుతున్నావ్రా.... దేవుళ్ళూ రండిరా. మీ పెళ్ళాలకు యింతటి ఘోరం జరిగితే సహించగలరా.... వీడి చూపులబాణాలు నా తొడల మధ్య దూసుకుపోతున్నాయ్.... వీడి కోర్కెల కోరలు నన్ను చీల్చేస్తున్నాయ్.... నా భర్తగాడు నా శరీరాన్ని నొక్కి పెడుతున్నాడు.... ముక్కోటి దేవుళ్ళారా.... దొంగ లంజా కొడకల్లారా.... రండిరా.... రండి.... ఓ ఆడదాని మానాన్ని కాపాడండిరా...." గొంతెత్తి బిగ్గరగా అరవాలనుకుంది తాయారు.

కానీ అరిచే శక్తి ఆమెకు లేదు. ఆమె ఆత్మఘోష ఏ దేవుళ్ళకూ విన్పించలేదు.

పొయ్యిలో పిల్లి మాత్రం ఆ దృశ్యాన్ని గుర్రుగా చూస్తూనే వుంది.

"కానీయండి.... త్వరగా....హూ, కానీయండి" అరుస్తున్నాడు రాజన్న.

ఉత్సాహంగా ఆ వ్యక్తి కదలబోయాడు.

సరిగ్గా అదే సమయంలో-'మ్యావ్' మంటూ విదారకంగా అరిచింది పిల్లి.

దాని అరుపుకి తలెత్తి అటు చూశాడు రాజన్న.

అంతే! భీకరంగా అరుస్తూ పిల్లి గాల్లోకి ఎగిరింది.

మరునిమిషం 'కెవ్వు' మంటూ హృదయ వికారంగా అరిచాడు రాజన్న.

అదిరిపడి ఆ వ్యక్తి రాజన్న వేపు చూశాడు.

రాజన్న రెండు కనుగుడ్ల లోంచి నెత్తురు ధారల్లా కారుతోంది. కింద పడి గిలగిలా తన్నుకుంటూ, గుండెలు అవిసేట్లు బాధతో అరుస్తున్నాడు.

ఆ దృశ్యాన్ని చూడలేక కీచుగా అరుచుకుంటూ ఆవ్యక్తి నగ్నంగానే బయటకు పరుగుతీశాడు.

అటుపై ఆ యింట్లో పిల్లి ఎన్నడూ పొయ్యిలోంచి లేవలేదు. ●